క్లుప్తంగా

గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు



గౌరీ పరమేశ్వరులను దర్శించుకుంటున్న భక్తులు

అల్లిపురం: వేంకటేశ్వర మెట్టపై శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో గౌరీపరమేశ్వరుల మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా హరనామ స్మరణతో వెంకటేశ్వరమెట్ట మార్మోగింది. గ్రంథాలయం అధ్యక్ష, కార్యదర్శులు పాలమరశెట్టి శ్యామ్‌కుమార్, పాలమరశెట్టి శ్రీను మాట్లాడుతూ ఈ ఏడాది కూడా భవానీలు, స్వాములకు ఈ నెల 7న నుంచి భిక్ష ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రోజూ మధ్యాహ్నం 12 గంటల నుంచి అమ్మవారి సన్నిధిలో ప్రారంభమవుతుందని, అందరూ భిక్ష స్వీకరించాలని కోరారు.

అయోడిన్ ఉప్పుతో ఆరోగ్యం



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న చిన్నారులు

మద్రిపాలెం : అయోడిన్ కలిగిన ఉప్పు వాడకం వల్ల పిల్లలు శారీరకంగా, మానసికంగా వృద్ధి చెందుతారని ఐసీడీఎస్ అర్బన్ సీడీపీవో రమణకుమారి సూచించారు. జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అయోడిన్ ఉప్పు వల్ల కలిగే ప్రయోజనాలపై సోమవారం అవగాహన కల్పించారు. అయోడిన్ లోపం వల్ల ఎదురయ్యే శారీరక, మానసిక రుగ్మతలను తెలియజేశారు. గర్భం దాల్చిన ప్పటి నుంచి ఆరోగ్య సంబంధిత విషయాలపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మద్రిపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ జ్యోతి, మహిళా పోలీస్ వరలక్ష్మి, టీచర్ మాలా బీబీ పాల్గొన్నారు.

రైతు నిజాయితీ

సీతమ్మధార : సీతమ్మధార రైతుబజారులో ఓ రైతు తన నిజాయితీతో అందరి మన్ననలూ అందుకున్నారు. అసలేం జరిగిందంటే... సోమవారం రాత్రి రైతుబజారులో పూజ సామగ్రి కోసం కేఆర్ఎం కాలనీకి చెందిన ఆదిలక్ష్మి అనే మహిళ వచ్చారు. ముందుగా అరటి పళ్లు కొనుగోలు చేసిన ఆమె అక్కడి నుంచి వేరే స్టాల్ వద్దకు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేశారు. అనంతరం డబ్బులు ఇచ్చేందుకు చూడగా నగదు, ఫోన్ ఉన్న పర్స్ కనిపించలేదు. అప్పటికే అరటి పళ్లు విక్రయించే రైతు డి.దుర్గ ఆ పర్సు గమనించి రైతుబజారు ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబుకు అందించాడు. దీంతో ఆయన మైక్‌లో ప్రకటించడంతో ఆదిలక్ష్మి వెళ్లి సంప్రదించారు. డబ్బులు, ఫోన్ ఉన్న పర్సును ఆమెకు ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్ అందించారు. రైతు దుర్గ నిజాయతీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఆటోలో పాము కలకలం



ఆటోలోకి దూరిన పామును తీస్తున్న స్థానికులు

మద్రిపాలెం : జీవీఎంసీ 53వ వార్డు పార్వతీనగర్‌లో పాము కలకలం రేపింది. ఈ మేరకు పార్వతీనగర్ జాతీయ రహదారి సేవా మార్గంలో రోడ్డు పక్కన డివైడర్ వద్ద ఓ ఆటో డ్రైవర్ ఆటోను రోడ్డు పక్కన నిలిపారు. ఇంతలో అక్కడ ఉన్న పాము ఆటోలోకి దూరిపోయింది. ఎంతసేపు వెతికినా చిక్కలేదు. చివరకు ఆటో అంతా గాలించి చూస్తే ముందు టైర్ భాగం లోపలికి దూరిపోవడంతో బయటకు తీశారు. దీంతో అక్కడున్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

ప్రతిధ్వనించిన పంచాక్షరి

కిటకిటలాడిన శివాలయాలు



సింగ్ హోటల్ జంక్షన్ ఓంకార ఆలయంలో మహాశివునికి పూజలు చేస్తున్న అర్చకుడు



ఉమా చంద్రమౌళేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు



శివయ్య సేవలో భక్తులు

డాబాగార్డెన్స్: శివనామస్మరణతో శివాలయాలు మార్మోగాయి. పరమశివునికి ప్రీతికరమైన కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు ఆలయాలకు పోటెత్తారు. సూర్యాభాగ్ విశ్వేశ్వరాలయంలో వేకువజాము నుంచే భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపారాధన చేశారు. స్వామికి ఏకవారాభిషేకం, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు చేశారు. అస్సాం గార్డెన్స్ శ్రీశివరామకృష్ణ దేవస్థానం, బౌడరా రోడ్డులో గల మురళీధర వీధి శ్రీపంచముఖేశ్వర దక్షిణామూర్తేశ్వర దేవాలయం, సూర్యాభాగ్ అగ్నిమాపక కేంద్రం సమీపాన ఉన్న ఉమా రామలింగేశ్వరాలయంలో భక్తుల తాకిడి కనిపించింది. 31వ వార్డు సింగ్ హోటల్ జంక్షన్ సమీపాన ఓంకార ఆలయంలో మహాశివునికి ప్రత్యేక పూజలు చేశారు. గొల్లలపాలెం శెట్టిబలిజ సంఘం వద్ద ఉన్న సాయి రామలింగేశ్వరాలయం, ఏవీఎన్ కాలేజ్‌లోని శివాలయంలో విశేష పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు.

అల్లిపురం: కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా నియోజకవర్గంలోని శైవ క్షేత్రాలు కిటకిటలాడాయి. ముక్కంటిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచి భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా శివయ్యకు పంచామృతాభిషేకాలు, విశేష అభిషేకాలు చేశారు. నియోజకవర్గంలోని టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో ఉమా చంద్రమౌళీశ్వరస్వామికి అర్చకుడు భార్గవ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో విశేష అభిషేకాలు చేపట్టారు. డీబీకే రైల్వే క్వార్టర్స్‌లో గల శ్రీ భవానీ శంకర గణపతి ఆలయంలో, బౌడరా రోడ్డులో గల శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయం, మురళీధరవీధిలో గల పంచముఖేశ్వరస్వామి ఆలయంలో విశేషం పూజలు చేశారు. సాయంత్రం ఆకాశ దీపోత్సవంలో భక్తులు విశేష పూజలు నిర్వహించి, దీప దర్శనం చేసుకుని తరించారు. ఈ మేరకు శివరామకృష్ణ దేవస్థానం కార్యనిర్వహణాధికారి జీవీ రమాబాయ్, ఆలయ సిబ్బంది భక్తులకు క్యూలైన్లు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించారు.

8న మహాధర్నా విజయవంతం చేయండి

విశాఖ పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల పిలుపు



ఐక్యత చాటుతున్న పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

డాబాగార్డెన్స్: పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అన్ని యూనియన్లు ఈ నెల 8న పోర్టు ఏవోబీ వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. పీపీపీ పద్ధతిలో మల్టీ డిసిప్లెనరీ సూపర్ స్పెషాలటీ ఆస్పత్రిగా 300 పడకలతో నిర్మాణానికి ప్రైవేట్‌కి ఇవ్వడాన్ని అన్ని యూనియన్లు వ్యతిరేకించినా కేంద్ర ప్రభుత్వం, పోర్టు యాజమాన్యం ఏకపక్షంగా ఈ నెల 8న టెండర్ ఓపెన్ చేస్తుండడం దారుణమన్నారు. జగదాంబ జంక్షన్ సమీపాన సిటూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. మహాధర్నాలో పెద్ద ఎత్తున పోర్టు అండ్ డాక్ ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు, క్యాజువల్ వర్కర్లు, పూల్ కార్మికులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఆస్పత్రి ఒకసారి ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్తే తిరిగి పోర్టు నిర్వహణలోకి వచ్చే అవకాశం లేదని, అందరూ వైద్యానికి దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. లాభాలతో నడుస్తున్న విశాఖ పోర్టు సొంత నిధులతోనే హాస్పిటల్‌ను మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలని, స్పెషలిస్ట్ డాక్టర్లు, ల్యాబ్ మిషనరీ, స్పెషలైజ్డ్ స్టాఫ్, నాణ్యమైన మందులు సమకూర్చాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమణబాబు, కె.మంగయ్యానాయుడు, బి.జగన్, కె.సత్యనారాయణ, బి.లక్ష్మణరావు, జె.సత్యనారాయణ, వి.రామలింగేశ్వరరావు, కృష్ణమూర్తి, జి.చందు, బి.రవి, బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ రోగికి ఆర్థిక సాయం



నాగరాజుకు నగదు అందజేస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం బాబుకాలనీలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న బొద్దన నాగరాజును కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ సోమవారం పరామర్శించారు. ఆపదలో ఉన్న వార్డు ప్రజలకు తామున్నామంటూ కిడ్నీ రోగి నాగరాజుకు రూ.5వేలు అందించారు. అధికారంలో ఉన్నా, లేకున్నా తమని గెలిపించిన ప్రజలకు అన్నివేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నపూర్ణ, ఈశ్వరి, దేవి, సీహెచ్ శ్యామ్‌సుందర్, ఆకుల శ్యామ్, ఆనంద్, అరసాద లక్ష్మి, రాంజనమ్మ, మురళి పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో అశ్వినికి రజతం



అశ్వినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల, పలువురు అధ్యాపకులు

డాబాగార్డెన్స్: ఆంధ్రా యూనివర్సిటీ నిర్వహించిన అంతర కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థిని మజ్జి అశ్విని రజత పతకం సాధించింది. కళాశాలలో బీఎస్సీ (జువాలజీ) సెకండియర్ చదువుతున్న అశ్విని.. అంతర్జాతీయ క్రీడాకారిణి, విశాఖ జిల్లా స్పోర్ట్స్ అథారిటీలో కోచ్‌గా వ్యవహరిస్తున్న పూజారి శైలజ శిక్షణలో రాణిస్తోంది. 2023–24లో ఏయూ ఇంటర్ కాలేజీయేట్‌లో కాంస్యం సాధించగా.. ఈ ఏడాది 71 కిలోల వెయిట్ కేటగిరీలో రజతం సాధించింది. ఈ సందర్భంగా అశ్వినిని ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల అభినందించారు. బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో ఉంటూ కళాశాల బోటనీ లెక్చరర్ మహాలక్ష్మి సహకారంతో అవసరమైన డైట్ తీసుకుంటూ, పట్టుదలతో ప్రాక్టీస్ చేస్తున్న అశ్విని మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కళాశాల పీఈటీ డాక్టర్ ఆర్.కిరణ్మయి, జువాలజీ లెక్చరర్ విజయలక్ష్మి, సిబ్బంది ఆమెకు అభినందనలు తెలియజేశారు.

నిరుపేద వివాహానికి వాసుపల్లి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 39వ వార్డుకి చెందిన నిరుపేద వివాహానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ విశాఖ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆర్థిక సాయం అందజేశారు. గరికిన ధనరాజు, అప్పలరాజు దంపతుల ద్వితీయ పుత్రిక దేవి వివాహ వేడుకకు సోమవారం వాసుపల్లి కార్యాలయానికి వెళ్లి ఆహ్వానించారు. ఈ మేరకు దేవి, వీరబాబును ఆశీర్వదించిన వాసుపల్లి రూ.5వేలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో తనను ఒక కుటుంబ సభ్యుడిగా భావించిన వారి కష్టసుఖాల్లో భాగస్వామిని కావడం ఆనందంగా ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన అనేక సంక్షేమ పథకాలు వారిని ఆదుకునేవన్నారు. ఇప్పటికీ వైఎస్సార్, వైఎస్ జగన్ పేదలకు చేసిన మంచి పనులు వారిని ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంచాయన్నారు. అటువంటి మహానీయులను ఆదర్శంగా తీసుకుని తన వంతు సాయంగా నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉంటున్నానని వాసుపల్లి తెలిపారు. కార్యక్రమంలో తాడి రవితేజ, వలిశెట్టి లక్ష్మి, చింతకాయల వాసు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి మేయర్



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి వస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీకి సోమవారం ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను వినియోగించే నిర్ణయం మేరకు జీవీఎంసీ ఉద్యోగులతో పాటు అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు.

వసతిగృహానికి 15 మంది తరలింపు



నిరాశ్రయులతో ఆర్‌పీఎఫ్ పోలీసులు, ఏయూటీడీ సిబ్బంది

సీతమ్మధార: విశాఖ రైల్వేస్టేషన్‌లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) సహకారంతో ఏయూటీడీ సంస్థ సోమవారం రెస్క్యూ నిర్వహించింది. విశాఖ రైల్వే స్టేషన్‌కి ఇతర రాష్ట్రాల నుంచి పలు రుగ్మతలతో బాధపడే నిరాశ్రయులు వస్తుంటారు. దీంతో ఇక్కడ తరచూ రెస్క్యూ నిర్వహించి నిరాశ్రయులను జీవీఎంసీ వసతిగృహానికి తరలిస్తుంటారు. ఈ నేపథ్యంలో విశాఖ స్టేషన్‌లో సోమవారం 15 మంది నిరాశ్రయులను గుర్తించి ద్వారకానగర్‌లో గల జీవీఎంసీ – ఏయూటీడీ వసతిగృహాలకు తరలించారు. ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు సమక్షంలో ఆర్‌పీఎఫ్ సీఐ రామకృష్ణ, ఇతర పోలీసులు, వసతిగృహాల మేనేజర్లు జ్యోతిర్మయి, భాస్కరరావు, కేర్‌టేకర్లు లీలా ధనలక్ష్మి, శ్రీనివాస్, ప్రశాంత్, శాంతి పాల్గొన్నారు.

నాగుల చవితికి పుట్టలు సిద్ధం



కెప్టెన్ రామారావు జంక్షన్‌లో సిద్ధమైన కృత్రిమ పుట్టలు

అల్లిపురం: నాగులచవితికి పుట్టలు సిద్ధమయ్యాయి. నియోజకవర్గంలోని ఏవీఎన్ కళాశాల, కేజీహెచ్, మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లోని సహజసిద్ధమైన పుట్టలతో పాటు కెప్టెన్ రామారావు జంక్షన్, రైల్వేక్వార్టర్స్‌లో కృత్రిమపుట్టలను సిద్ధం చేశారు. కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయంలో పుట్టలను ఆలయ నిర్వాహకులు సిద్ధం చేశారు. టూటౌన్ దరి శివరామకృష్ణ దేవస్థానంలోని సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో నాగుల చవితి పూజలకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జీవీ రమాబాయి తెలిపారు.

సీవీ రామన్ పేరిట వ్యాసరచన పోటీలు

డాబాగార్డెన్స్: సర్ సీవీ రామన్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 5, 6 తేదీల్లో ఏవీఎన్ కళాశాలలో వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యార్థులతోపాటు ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. కళాశాల పూర్వ విద్యార్థి సర్ సీవీ రామన్ భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందడం మనందరికీ గర్వ కారణమని, ఆయన పేరిట పోటీలు నిర్వహించి జయంతి వేడుకలు నిర్వహించనున్నట్టు తెలిపారు. పోటీల్లో పాల్గొనాలనుకునే విద్యార్థులు ఏవీఎన్ కళాశాల ఫిజిక్స్ విభాగాధిపతి డి.సంతోష్‌కుమార్‌ను 8309053866లో సంప్రదించాలని సూచించారు.

సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు

జగదాంబ: సమస్యల పరిష్కారానికి ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు వినియోగించుకోవాలని జీవీఎంసీ జోన్ – 4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సూచించారు. సోమారం ఆయన ప్రజల నుంచి పబ్లిక్‌హెల్త్‌కు సంబంధించి 2, రెవెన్యూ విభాగానికి 2, టౌన్‌ప్లానింగ్ విభాగానికి 10, తాగునీటి సరఫరాకు సంబంధించి ఒక వినతి స్వీకరించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ గ్రీవెన్స్ ద్వారా వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. సమస్యలతో వచ్చిన ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకూడదన్నారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఝాన్సీ, రెవెన్యూ అధికారులు అప్పలరాజు, తదతరులు పాల్గొన్నారు.

అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్రుల కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 2711725, 2566514కు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 (టౌన్ కొత్త రోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ – యూబీఐఎన్ 0806081)కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

పూర్తి వేతనాల చెల్లింపునకు వినతి



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం సమర్పిస్తున్న యూనియన్ నాయకులు

మహారాణిపేట: పాక్షిక జీతాల చెల్లింపు కాకుండా పూర్తి స్థాయి జీతాలు ఇవ్వాలని కోరుతూ అవుట్ సోర్సింగ్ సిబ్బంది డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఎఫ్ఆర్ఎస్‌లో సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు నిరంతరం నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్నామన్నారు. కానీ, చాలీచాలని జీతాలు ఇస్తున్నారని, ఇటీవల వీటిలో కూడా కోత విధిస్తున్నారని నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్టు మరియు అవుట్ సోర్సింగ్ యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పని చేసే ఉద్యోగులకు నెట్, ఇతర సమస్యలతో కొద్దిగా ఆలస్యం అవుతోందని, కానీ వీటి ఆధారంగా అటెండెన్స్ వేసి జీతాల్లో కోత విధిస్తున్నారని తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. డీఎంహెచ్‌వోను కలిసిన వారిలో యూనియన్ అధ్యక్షుడు శశిభూషణ్, సెక్రటరీ వీరబ్రహ్మం, ట్రెజరర్ గోపీనాథ్ తదితరులు ఉన్నారు.

పూర్ణామార్కెట్‌కు చవితి సందడి



పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



అమ్మకాలకు సిద్ధం చేస్తున్న చెరకు గెడలు





అల్లిపురం మహాత్మాగాంధీ మార్కెట్లో నువ్వు పప్పు, పత్రి, పువ్వుల అమ్మకాలు

జగదాంబ: పూర్ణామార్కెట్‌లో చవితి సందడి నెలకొంది. తాటితేగలు, తాటి టెంకాయలు, చెరకు, పువ్వులు, ముఖ్యంగా చవితికి కావల్సిన నువ్వులు, బెల్లం, నాగుల పంచె , కలకూరలు, పండ్లు వంటి అన్ని సరకులు ఒకేచోట లభ్యమయ్యే ప్రాంతం కావడంతో మార్కెట్ వినియోగదారులతో కిటకిటలాడింది. అరటిపండ్లు, పువ్వుల ధరలు అధికంగా అమ్మకాలు చేయగా.. పూజాసామగ్రి ధరలు అందుబాటులో ఉన్నాయి. కమలాపండ్ల ధరలు కిలో రూ. 200 వరకు అమ్మకాలు చేశారు.

ఆకాశాన్నంటిన ధరలు

అల్లిపురం/డాబాగార్డెన్స్: నాగుల చవితి సందర్భంగా అల్లిపురం, మహాత్మాగాంధీ మార్కెట్ కొనుగోలుదారులతో కళకళలాడాయి. అయితే, ధరలు మాత్రం ఆకాశాన్నంటాయని వినియోగదారులు వాపోతున్నారు. నువ్వుపప్పు కేజీ రూ.270 నుంచి రూ.290, బెల్లం రూ.60 నుంచి రూ.65కి, తాటిగుజ్జు ప్యాకెట్ రూ.20, తాటి టెంకలు మూడు రూ.20, అరటి ఆకు ఒకటి రూ.5, అరటి పండ్లు డజను (దేశవాళి) రూ.70 నుంచి రూ.80, నాగపూర్ డజను రూ.80 నుంచి రూ.100, పువ్వులు డజను రూ.20 నుంచి రూ.30, తంగేడు, గొబ్బిపువ్వులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలి



జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

సీతమ్మధార: తమకు పే స్కేల్ అమలు చేయాలని గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ) జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. వీఆర్ఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన వ్యక్తం చేశారు. తక్షణం కూటమి ప్రభుత్వం వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయాలని, పదోన్నతులు కల్పించాలని, నామిని వీఆర్ఏలను గ్రామ రెవెన్యూ సహాయకులుగా (వీఆర్ఏ) గుర్తించాలని, తెలంగాణ రాష్ట్రంలో మాదిరిగా జీతాలు చెల్లించాలని నినాదాలు చేశారు. వీఆర్ఏల విశాఖ జిల్లా గౌరవాధ్యక్షుడు పి.వెంకటరావు మాట్లాడుతూ జిల్లాల విభజన జరిగిన తర్వాత కొత్త కలెక్టర్ ఆఫీసులో, ఆర్డీవో ఆఫీస్‌లో ఖాళీలు ఏర్పడ్డాయన్నారు. అటెండర్, వాచ్‌మన్, డ్రైవర్ పోస్టులు ఖాళీలు ఉన్నప్పటికీ అర్హత ఉన్నవారికి పదోన్నతులు ఇవ్వడం లేదన్నారు. పార్ట్ టైం ఉద్యోగులైన వీఆర్ఏలకు జాబ్‌చార్ట్ ప్రకారం డ్యూటీలు కాకుండా మండల ఆఫీసులలో నైట్ వాచ్‌మన్ డ్యూటీ వేస్తున్నారని, ఇతర డ్యూటీలకు కూడా పిలుస్తున్నారని, తక్షణం వాటిని రద్దు చేయాలన్నారు. ఈ నెల 18వ తేదీలోగా వీఆర్ఏల సమస్యలు పరిష్కరించకుంటే చలో సీసీఎల్ఏ ఆఫీసు ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 50 మంది వీఆర్ఏలు పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎ.సత్యం, పద్మనాభం మండలం అధ్యక్ష కార్యదర్శులు పి.సాధు, ఎస్.వరం హాజరయ్యారు.

32వ వార్డులో ఎమ్మెల్యే పర్యటన



నేరెళ్ల కోనేరులో ఎమ్మెల్యే వంశీకృష్ణకు సమస్యలు వివరిస్తున్న స్థానికులు

అల్లిపురం: జీవీఎంసీ 32వ వార్డులో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం పర్యటించారు. కార్పొరేటర్ కందుల నాగరాజుతో కలసి వార్డులోని నేరెళ్లకోనేరు, ఏడుగుళ్ల స్లమ్, చలువతోట, తారకరామ కాలనీ, భీమ్‌నగర్, సౌత్ జైలురోడ్డు, దేవాంగుల వీధి తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో ఏడుగుళ్ల సమస్య పరిష్కారంతో పాటు, కల్యాణమండపం, ప్లే గ్రౌండ్ నిర్మాణం ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు త్వరలో శ్రీకారం చుట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జోన్–4 జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, ఏఎంవోహెచ్ కృష్ణంరాజు, ఎస్ఎస్ కిషోర్‌కుమార్, ఏపీడీ కె.పద్మావతి, ఇతర అధికారులు, వార్డు నాయకులు పాల్గొన్నారు.